# బీఆర్ఎస్‌తోనే బొగ్గుట్ట బాగు



- పట్టుబట్టి ఇల్లెందుకు బస్‌డిపో తీసుకొచ్చా..
- విద్యార్థుల కోసం ఐటీఐ కాలేజీ తెచ్చా..
- ఆధునిక వసతులతో 100 పడకల సీహెచ్‌సీ నిర్మించా..
- తెలంగాణ వచ్చినంకనే సాగునీటి కష్టాలు తీరినయి..
- బయ్యారం ఉక్కు కర్మాగారం కోసం పోరాడుతూనే ఉంటా..
- 'నమస్తే'తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియ

నమస్తే ఇంటర్వ్యూ

ఖమ్మం, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్‌తోనే ఇల్లెందు నియోజకవర్గంలో అభివృద్ధికి కొనసాగింపు ఉంటుందని, ప్రజలు మరోసారి అవకాశం ఇస్తే నియోజకర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు హరిప్రియానాయక్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె నిత్యం బిజీ బిజీగా ఉంటున్నారు. జిల్లా పరిధిలోని ఇల్లెందు, టేకులపల్లి మండలాలతోపాటు నియోజకవర్గంలో భాగమైన మానుకోట జిల్లా గార్ల, బయ్యారం మండలాలు, ఖమ్మం జిల్లా పరిధిలోని కామేపల్లి మండలంలోనూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు తనదేనని, నియోజకవర్గ ప్రజలు తనకే పట్టంకడతారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఆమె 'నమస్తే'తో ముచ్చటించారు. పలు విషయాలను వెల్లడించారు.

### సిరుల గనుల కేంద్రం..

ఇల్లెందును ఇప్పటికీ ప్రజలు బొగ్గుట్ట అని పిలుచుకుంటారు. ఇక్కడి సింగరేణి జేకే-5 గని ద్వారా వేలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. పూసపల్లిలో మరో ఓసీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది. గతంలో నియోజకవర్గ రైతులు సాగునీటి కోసం అల్లాడిపోయేవారు. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా మిషన్ కాకతీయ అమలు చేశారు. పథంలో భాగంగా చెరువులు, కుంటల పునరుద్ధరణ జరిగింది. చెరువు కట్టలు బలపడ్డయి. రైతుల సాగునీటి కష్టాలు తీరినయి. అలాగే ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ప్రతిష్ఠాత్మంగా సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రాజెక్ట్ పూర్తయితే నియోజకవర్గంలో సాగునీటికి ఢోకా ఉండదు. గతంలో ఏజెన్సీవాసులు జబ్బున పడితే కొత్తగూడెం, ఖమ్మం వంటి ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకునేవారు. వైద్యానికి వేలాది రూపాయాలు వారికి ఖర్చు చేసేవారు. సర్కార్ గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఇల్లెందులో ఆధునాతన సౌకర్యాలతో ఆసుపత్రి నిర్మించింది. నేను ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేశాను. నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు ఐటీఐ చదువుకునేందుకు వీలుగా ఇల్లెందులో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయించాం.

### బస్‌డిపో కల నెరవేర్చాం..

ఇల్లెందులో బస్‌డిపో ఉండాలనేది ఏజెన్సీవాసుల చిరకాల వాంఛ. వారి కలలను నెరవేరుస్తూ బస్‌డిపో తీసుకువచ్చాం. నియోజకవర్గ ప్రజలు నన్ను ఎన్నడూ శాసనసభ్యురాలిగా, హైదరాబాద్‌లోనే ఉండే వ్యక్తిగా చూడడం లేదు. తమ ఇంటి బిడ్డగా చూస్తునానరు. పిలిస్తే పలికే ప్రజాప్రతినిధిగా నన్ను గుర్తిస్తున్నారు. 'సమస్య ఎక్కడ ఉంటే అక్కడ హరిప్రియ ఉంటుంది..' అనే పేరు ఇక్కడే ఉంది. అలాగే చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ప్రజలకు బీఆర్ఎస్‌పైనా నమ్మకం పెరిగింది. వారు బీఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. కరోనా సమయంలో నేను గర్భిణిని. అయినప్పటికీ ప్రతి గిరిజన తండాకు వెళ్లి బాధితులకు వైద్యసాయం అందించాను. నిత్యావసర సరుకులు అందించాను.

### అభివృద్ధి.. ప్రలోభాలకు మధ్యే పోటీ..

ఇల్లెందు నియోకవర్గంలో ఈసారి జరుగుతున్న ఎన్నికలు అభివృద్ధికి, ప్రలోభాలకు మధ్య జరిగే ఎన్నికలు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెడుతున్నది. ఇతర పార్టీలకు చెందిన నేతలతో బేరసారాలు సాగిస్తూ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నది. బయ్యారంలో ఉక్కు కర్మాగారం రావాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇక్కడ లభించిన ఇనుప ఖనిజం ఇతర ప్రాంతాలకూ రవాణా అయింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు నాణ్యత పేరుతో అనేక అడ్డంకులు సృష్టిస్తూ కర్మాగారాన్ని అడ్డుకుంటున్నది. ఛత్తీస్‌గఢ్‌లోని బైలడిల్లాలో కర్మాగారం నిర్మించాలని పూనుకుంటున్నది. ఎన్నికల్లో గెలిచి రానున్న రోజుల్లో బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని తెచ్చుకునే వరకు పోరాటం చేస్తా. కర్మాగారం కోసం నేను గతంలో 36 గంటల నిరసన దీక్ష చేశా. ఇదే ఉద్యమ స్ఫూర్తి ముమ్ముందూ కొనసాగిస్తా.



---

## వంద కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో వనమా రామకృష్ణ

పాల్వంచ, నవంబర్ 18 : పట్టణంలోని నవభారత్ శేఖరంబంజర్‌లో సుమారు వంద కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీని వీడి శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. బానోత్ చందు, భూక్యా ప్రసాద్ ఆధ్వర్యంలో వనమా రామకృష్ణ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కార్యకర్తలందరిని కంటికిరెప్పలా కాపాడుకుంటామని, వనమా తన చివరి రక్తపు బొట్టు వరకు కార్యకర్తల కోసం పనిచేస్తారని, గెలుపు మనదేనని అన్నారు. పరిటాల సుబ్బారావు, బట్టు మంజుల, కమలాకర్, రాంబాబు, యాకయ్య, రాము, సునిల్, భూక్యా వీరన్న, కుమార్, శేఖర్, హరీశ్, గణేశ్, యాకేశ్, ముత్యాల ప్రవీణ్, వీర్రాజు, కల్యాణ్, శ్రీకాంత్, నవభారత్ ఆనంద్ పాల్గొన్నారు.

### జూలూరుపాడు మండలం నుంచి పలువురు..



పార్టీలో చేరిన వారితో మదన్‌లాల్

జూలూరుపాడు, నవంబర్ 18 : మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారానికి వచ్చిన మదన్‌లాల్ సమక్షంలో గ్రామానికి చెందిన కాలసాని నర్సింహారావు, ముత్తినేని గోపాలరావు, పాతర్లపాటి సతీశ్, కంచి సోమయ్య, గోసి రామకృష్ణ తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి మదన్‌లాల్ సాదరంగా ఆహ్వానించారు. వీరి వెంట బీఆర్ఎస్ నాయకులు యల్లంకి సత్యనారాయణ, దుద్దుకూరి నాగేశ్వరరావు, మూడు చిట్టిబాబు, మాజీ మండల అధ్యక్షుడు చావా వెంకటరామారావు, నర్సింహారావు పాల్గొన్నారు.

## సింగరేణి సూపర్‌బజార్ వార్షికోత్సవం

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 18: దేశవ్యాప్తంగా ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న ఆలిండియా కో-ఆపరేటివ్ వారోత్సవాల్లో భాగంగా శనివారం సింగరేణి అధికారులు కొత్తగూడెంలోని సూపర్‌బజార్‌లో వార్షికోత్సవం నిర్వహించారు. వేడుకలో జీఎం పర్సనల్, సూపర్‌బజార్ అధ్యక్షుడు హనుమంతరావు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి వెంకటేశ్వర్లు, సూపర్‌బజార్ ఎండీ సామ్యూల్ సుధాకర్, డీవై ఎఫ్ఎం కాంతారావు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు

### భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల



లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

పాల్వంచ, నవంబర్ 18: ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. శుక్రవారం ఆమె పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజీ ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు. పోలీసులు, రిటర్నింగ్ అధికారులు, ఆర్అండ్‌బీ, సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డుశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... 30న పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఎన్నికల సంఘం నియమావళి మేరకు అత్యంత భద్రత మధ్య ఈవీఎంలు భద్రపరచాలన్నారు. స్ట్రాంగ్ రూం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రెండంచెల మెష్ ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయాలన్నారు. ఎలాంటి షార్ట్ సర్క్యూట్లకు తావు లేకుండా విద్యుత్‌శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. లెక్కింపు విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచించారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులను కేంద్రంలోనికి అనుమతించరాదన్నారు. మూడంచెల భద్రతా చర్యల్లో భాగంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లకు నియోజకవర్గానికి ఆర్అండ్‌బీ నుంచి ఇంజినీర్లను నియమించాలన్నారు. కేంద్ర పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ.. లెక్కింపు ప్రక్రియకు కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రంలో 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు ప్రతీక్‌జైన్, రాంబాబు, శిరీష, మంగీలాల్, కార్తీక్, ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లా, సర్వే లాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమకుమారి పాల్గొన్నారు.

## మృతదేహాన్ని ఇంటి ముందు ఉంచి ఆందోళన



మృతదేహం వద్ద గుమిగూడిన జనం

బోనకల్లు, నవంబర్18: తమ కుమారుడి మరణానికి కారణం భూమిని అక్రమంగా బదాలయించుకున్న వ్యక్తే కారణమంటూ తల్లిదండ్రులు అతడి ఇంటిముందు ఆందోళన చేపట్టిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురానికి చెందిన కొమ్మినేని వెంకటేశ్వర్లుకు వారసత్వంగా మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిపై ఇదే గ్రామానికి చెందిన ఓ నాయకుడు తన పేరుపై పట్టాదారు పుస్తకాలు చేయించుకున్నాడు. భూమిని మాత్రం వెంకటేశ్వర్లు సాగు చేసుకుంటున్నాడు. పట్టాతీసుకున్న నాయకుడు మాత్రం ప్రభుత్వం నుంచి అందే ఫలాలన్నింటినీ అనుభవిస్తున్నాడు. తన భూమి అక్రమంగా బదలా అయిందని తెలుసుకున్న వెంకటేశ్వర్లు, ఆయన కుమారుడు సైదులు అప్పటి నుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కొన్ని నెలల క్రితం బాధితులు పట్టాపొందిన వ్యక్తి ఇంటికి వెళ్లి భూమిని తమ పేరుపై మార్చాలని పెద్దమనుషుల సమక్షంలో కోరారు. పట్టా పొందిన వ్యక్తి దీంతో వెంకటేశ్వర్లు పేరుపై పట్టా వచ్చేలా చేస్తానని హామీ అగ్రిమెంట్ రాసి ఇచ్చాడు. ఇప్పటి వరకు ఆ హామీ నెరవేర్చకపోవడంతో బాధితుడు వెంకటేశ్వర్లు కుమారుడు సైదులు(30) మనస్తాపానికి గురయ్యాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం పరిస్థితి విషమించి మృతిచెందాడు. తన కుమారుడికి మృతికి కారణం అక్రమంగా పట్టా పొందిన వ్యక్తే కారణమని, సైదులు మృతదేహాన్ని అతడి ఇంటి ముందు ఉంచి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో కలిసి రెండున్నర గంటల పాటు ఆందోళన చేశాడు. పొలం తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించేంత వరకు సైదులు మృతదేహాన్ని ఇంటి ముందు నుంచి తీసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై సాయికుమార్, సిబ్బందితో పాటు మరికొందరు రాజకీయ నాయకులు గ్రామానికి వచ్చారు. పట్టా పొందిన వ్యక్తితో చర్చలు జరిపి భూమి బదలాయింపునకు ఒప్పించారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. యువకుడి మృతిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా భూమిని అక్రమంగా బదాలాయించుకున్న వ్యక్తి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి, నేత అని తెలుస్తున్నది.

## గంజాయి స్వాధీనం

మధిరరూరల్, నవంబర్18: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం మధిర రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ వచ్చే సమయంలో స్టేషన్‌కు కొద్దిదూరంలో రైల్వేట్రాక్ పక్కన తెల్లనిప్లాస్టిక్ బ్యాగును గమనించారు. అక్కడి వెళ్లి బ్యాగు తెరచి చూడగా దానిలో గంజాయి ఉన్నది. పట్టుబడిన గంజాయి ఏడు కిలోలు ఉంటుందని, దీని విలువ రూ.1.70 లక్షల వరకు ఉంటుందని ఎక్సైజ్ సిబ్బంది తెలిపారు. అలాగే మధిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రామన్నపాలెం, ఎర్రుపాలెం, నిదానపురం, చిన్న బీరవల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించి 28.8 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.